క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి కళింగపట్నం వాడపల్లి గ్రామానికి చెందిన పప్పు గోవిందరావు, జ్యోతి దంపతులు గురువారం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. కుమార్తె సునీల జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని సూపరింటెండెంట్ కనకరాజుకు అందించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ పాల్గొన్నారు.

వస్త్రాల వితరణ



సోమేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు కొంచాడ సోమేశ్వరరావు జన్మదినం సందర్భంగా గురువారం అనురాగ నిలయంలోని చిన్నారులు, ఆనంద నిలయంలోని వృద్ధులు, సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ పేదలకు ఎలాంటి సాయం కావాలన్నా ముందుండే వ్యక్తి సోమేశ్వరరావు అని గుర్తు చేశారు. కార్యక్రమంలో కొంక్యాన మురళీ, కొంచాడ రవికుమార్, వనజ, నిర్వాహకులు లలిత, సాయి సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా రామయ్య తండ్రి సంబరాలు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో గురువారం రామయ్య తండ్రి సంబరాలు ముగిశాయి. పున్నాన కుటుంబ సభ్యుల సమక్షంలో వందలాది మంది భక్తులు స్వామివారిని ఊరేగించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, అక్కలనాయుడు, పాపినాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎచ్చెర్ల : లావేరు మండలం పెదలింగాలవలస గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇంటింటి సర్వేను గురువారం ఎంపీడీఓ పి.వెంకటరాజు పరిశీలించారు. అనంతరం సచివాలయం సిబ్బంది చేస్తున్న సర్వే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

ఎచ్చెర్ల: గంజాయి రవాణా, వాడకాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేందుకు గట్టి చర్యలు తీసుకున్నట్లు శ్రీకాకుళం డీఎస్పీ చెలమలశెట్టి వివేకానంద తెలిపారు. గురువారం లావేరు పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో మార్చి నెలాఖరులోగా మూడు వేల సీసీ కెమారాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గ్రామ కూడళ్లు, రహదారి ప్రారంభం, ముగింపు ప్రదేశాలు, జనసంద్రంగా ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచ్‌లు ముందుకు రావాలని కోరారు. ప్రజలు, వ్యాపారులు కూడా సహకరించాలన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈయనతో పాటు ఎస్సై జి.లక్ష్మణరావు, ఏఎస్సై జగన్మోహనరావు, చక్రి ఉన్నారు.

వర్మీకంపోస్టు అమ్మకాలు చేపట్టాలి



చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ

ఎచ్చెర్ల: చెత్తసంపద తయారీ కేంద్రాల ద్వారా తయారుచేస్తున్న వర్మీకంపోస్ట్ ఎరువుల అమ్మకాలు చేపట్టాలని మండల పరిషత్ విస్తరణాధికారి ఆర్.విశ్వేశ్వరరావు సిబ్బందికి సూచించారు. గురువారం లావేరు మండలం గురుగుబిల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్‌లో నిల్వ ఉన్న వర్మీకంపోస్ట్‌ను విక్రయించి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.భవానీ, టెక్నికల్ అసిస్టెంట్ గౌరినాయుడు పాల్గొన్నారు.

సృజనాత్మక ప్రయోగం



శ్రీకూర్మం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సైన్సు ల్యాబ్‌లో విద్యార్థులు



ల్యాబ్‌లో కలిసికట్టుగా ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

- పాఠశాల స్థాయిలోనే ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు
- ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న శ్రీకూర్మం బాలురు ఉన్నత పాఠశాల
- జీవశాస్త్ర, భౌతిక శాస్త్రాల్లో ఆసక్తి కలిగించమే లక్ష్యం
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

గార: ఇతర దేశాలతో పోల్చితే సైన్సు పరిశోధన రంగం మనదేశం కొంత వెనుకబాటులోనే ఉందని చెప్పవచ్చు. అందుకు ప్రధాన కారణం పాఠశాలలో స్థాయిలో విద్యార్థుల్లో సరైన ప్రయోగశాలలు లేకపోవడం, బట్టీ చదువులకే పరిమితం కావడమే. ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సైన్స్‌లో సరైన ఆలోచనలు అందించకలేకపోవడం కూడా ఒక కారణమే. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు గార మండలం శ్రీకూర్మం బాలురు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రెండు ప్రయోగశాలల ల్యాబ్‌లు (జీవశాస్త్ర, భౌతిక శాస్త్రం) ఉపాధ్యాయుల కృషితో ఏర్పడ్డాయి. సాంఘిక శాస్త్రం క్లబ్ సైతం ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యపై మక్కువ పెంచుతోంది. పిల్లలో ఉన్న సృజనాత్మక శక్తిని, ఊహాశక్తిని, పరిశోధనా శక్తిని పెంపొందించడమే ల్యాబ్‌ల ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వాస్తవంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు బోధించే జీవశాస్త్రం, భౌతికశాస్త్రం ల్యాబ్‌లు హైస్కూల్ స్థాయిలో ఏర్పాటు చేయడం తమ పిల్లలకు వరమని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించడమే కాకుండా విద్యార్థులు ఇప్పటివరకు పరిశోధించిన 120 ప్రదర్శనలు, ప్రాజెక్టులను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

నిత్య జీవితంలో భాగం



సైన్స్ అనేది నిత్య జీవితంలో భాగమైంది. పరిశోధనాత్మక ఆలోచన పెంచడమే లక్ష్యంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. విద్యార్థి దశ నుంచే సబ్జెక్టుపై పట్టు పెంచడమే ప్రయోగశాల ప్రధాన లక్ష్యం.

– కవిటి కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, శ్రీకూర్మం బాలుర హైస్కూల్

సృజనాత్మక శక్తి..



అన్ని సబ్జెక్టుల పరంగా పిల్లల్లో ఆసక్తి పెంచాలన్నదే మా ఉపాధ్యాయుల లక్ష్యం. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– జి.కృష్ణకుమారి, హెచ్‌ఎం, శ్రీకూర్మం బాలుర జెడ్పీ హైస్కూల్

ప్రయోగాలంటే ఇష్టం



మా స్కూల్లో అన్ని తరగతుల వారికి, అన్ని సబ్జెక్టులు చదువుకోవడంతో పాటు ప్రయోగాలు కూడా ఇష్టమయ్యేలా మా టీచర్లు చెబుతుంటారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగం కూడా చేయమని ప్రతి రోజూ కొత్తరకంగా ఆలోచించాలని, అదే పాఠశాల విద్య అని టీచర్లు నేర్పుతుంటారు.

– కె.శశాంక్ కుమార్, పదతరగతి విద్యార్థి, శ్రీకూర్మం

రోడ్లపై పశువులు..తప్పని అవస్థలు



నగరంలోని రోడ్లపై పశువుల సంచారం ఎక్కువైంది. మహిళా కళాశాల తదితర ప్రాంతాల్లో యజమానులు యథేచ్ఛగా వదిలేయడంతో రోడ్డుపైకి వచ్చి డివైడర్ల మధ్య మొక్కలు తినేస్తున్నాయి. కొన్నిసార్లు వాహనచోదకులు సైతం పశువుల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రమాదకర ప్రయాణం



శ్రీకాకుళం – కళింగపట్నం రోడ్డు, గార – చింతాడ రహదారుల్లో కొందరు ఆటోడ్రైవర్లు ప్రమాదకర రీతిలో ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. ఆటో వెనుక భాగంలో కూర్చోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– గార

ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం



రైతులు ఏడాది పాటు ఆదాయాన్ని ఇచ్చే ఏటీఎం మోడల్ సాగుకు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యసాయ ప్రాజెక్టు ప్రాంతీయ అధికారి హేమసుందర్ అన్నారు. మెట్టపేట గ్రామంలో ఐసీఆర్‌పీ ఎం.ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన క్యారెట్ సాగును గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మన్నాయుడు, సూర్యకళ పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైభవంగా లింగోద్భవ వేడుక



కాలభైరవాలయం వద్ద నాగావళి తీరాన 10 అడుగుల శివలింగానికి అభిషేకాలు



ధృవమూర్తిగా ఉమారుద్రకోటేశ్వరస్వామి



గార: శిమ్మపేట ఉమారామలింగేశ్వర ఆలయంలో లింగోద్భవం



ఉమాజఠలేశ్వరస్వామికి బియ్యం, పూలతో అర్చనలు



నందివాహనంపై ఊరేగుతున్న ఉమారుద్రకోటేశ్వరుడు



పూజలందుకుంటున్న బలగ ఉత్తరేశ్వరునిడు

శ్రీకాకుళం కల్చరల్: మహా శివరాత్రి మహోత్సవాలు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు కొనసాగాయి. శివుని ఊరేగింపు, లింగోద్భ మహోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామిని 100 కేజీల బియ్యంతో అభిషేకం నిర్వహించి ధృవమూర్తిగా అలంకరించారు. అనంతరం మహానందీశ్వర వాహనంపై ఉంచి పూలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. కొన్నావీధిలోని భీమేశ్వర స్వామి, బోడెమ్మకోవెలలోని జీవేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సంప్రదాయంగా ఊరేగింపు చేపటి ఏడురోడ్ల కూడలి వద్దకు తీసుకువచ్చారు. ఒకేచోటకు చేరిన స్వామివార్లను చూసి భక్తులు తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ, పెంట శ్రీనివాసశర్మ, గంట చిన్న రామమూర్తి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

- నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయం ఆధ్వర్యంలో 10 అడుగుల మృత్తికా శివలింగానికి పుష్పార్చనలు, జలాభిషేకం, ద్వాదశ హారతి సేవలను పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమాజఠలేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ వార మహారుద్రాభిషేకం, బియ్యంతో అలంకరణ జరిగింది. బలగ ఉమాసహిత ఉత్తరేశ్వరస్వామి, మొండేటివిధిలో శివకామేశ్వరస్వామికి కూడా బియ్యంతో అభిషేకం చేశారు.
- గార: అంపోలు అగస్త్యేశ్వర స్వామి ఆలయం, శిమ్మపేట ఉమారామలింగేశ్వర ఆలయం, లంకపేట ఘంటసాల స్మారకపీఠంలోని ఉమారామ లింగేశ్వరుడు, శాలిహుండం వీరవసంతేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం బియ్యంతో లింగోద్భవ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మొండేటివిధిలో శివకామేశ్వరుడి ఊరేగింపు



శివ కామేశ్వరునికి బియ్యంతో అలంకరణ

కల్యాణ వైభోగమే..



నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మహాశివరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అశ్వనీకుమార్ ఆధ్వర్యంలో అర్చకులు మహేష్, వేదుల భాస్కరశర్మల అర్చకత్వంలో సంప్రదాయంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

2 నుంచి పూసర్లపాడు గ్రామదేవత ఉత్సవాలు



ఉత్సవకమిటీ పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార: పూసర్లపాడులో వచ్చే నెల 2 నుంచి జరగనున్న గ్రామ దేవత అసిరితల్లి సిరిమానోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం పూసర్లపాడు వెళ్లి గ్రామపెద్దలతో ఉత్సవ విషయమై మాట్లాడారు. మంచినీరు, పారిశుద్ధ్య పనులు, విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అరవల మోహనరావు, రామకృష్ణ పెదబాబు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతం



శ్రీకాకుళంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రణస్థలం: జె.ఆర్.పురం పోలింగ్ కేంద్రం వద్ద అధికారుల పర్యవేక్షణ



ఎచ్చెర్ల క్యాంపస్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అధికారులు



గార: పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు



జి.సిగడాం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ నిర్వ హించారు. ఎచ్చెర్ల మండలానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 170 మందికి గాను 158 మంది వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయిప్రత్యూష, తహసీల్దార్ బి.గోపాలరావు, సీఐ ఎం.అవతారం, ఎస్సై వి.సందీప్‌కుమార్ పర్యవేక్షించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 57 ఓట్లకు గాను 54 ఓట్లు పోలయ్యాయి. తహసీల్దార్ ఎన్.ప్రసాద్, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పర్యవేక్షించారు.

జి.సిగడాం: మండల పరిషత్ పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి ఎం.శ్రీకాంత్ తెలిపారు. 84 ఓట్లకు గాను 82 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గార: గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 72 మందికి గాను 69 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఇన్‌చార్జి తహశీల్దార్ పద్మావతి, సీఐ పైడపునాయుడు, గార ఎస్సై ఆర్.జనార్దనరావు పరిశీలించారు.

శ్రీకాకుళం/క్రైమ్ : శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పరిశీలించారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

గార: మండలంలోని బూరవిల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య గురువారం పరిశీలించారు. కేంద్రం నిర్వహణ, వర్మీకంపోస్టు తయారీపై పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణ, వేర్వేరుగా ఉంచడంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కూర్మారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.